

## అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పండితులు పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.



## గ్రాసం..అడవికి జీవం

నల్లమలలో గడ్డి మైదానాల అభివృద్ధికి అటవీ శాఖ చర్యలు చేపట్టింది. గ్రాస్ మాన్ ఆఫ్ ఇండియా మురాత్కర్ అధ్యయనం చేసి రూపొందించిన ప్రణాళిక అమలుకు సిద్ధమైంది. 8లో▸



## మహానందీశుడి కల్యాణం

మహానంది: మహానందీశ్వరస్వామి నిత్యకల్యాణోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

## న్యూస్‌రీల్

### శ్రీశైలం నుంచి 7,853 క్యూసెక్కుల నీరు విడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైల జలాశయం ద్వారా గత శనివారం నుంచి ఆదివారం వరకు దిగువ ప్రాజెక్ట్‌లకు 7,853 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 0.763 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి 1,373 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,500, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,580 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పంప్‌మోడ్ ఆపరేషన్ ద్వారా 3,897 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి మళ్లించారు. ఆదివారం సాయంత్రం సమయానికి జలాశయంలో 86.4762 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 852.90 అడుగులకు చేరుకుంది.

### నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం

నంద్యాల: కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### చిత్తడి నేలలను కాపాడుకుందాం



విజేతలతో అధికారులు

నంద్యాల(న్యూటౌన్): పర్యావరణ పరిరక్షణలో కీలకమైన చిత్తడి నేలలను కాపాడుకుందామని నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా సమన్వయకర్త చంద్రశేఖరరెడ్డి, డీఈఓ జనార్దన్‌రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఎస్పీజీ పాఠశాలలో చిత్తడి నేలల దినోత్సవం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి శివరాంప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ చిత్తడి నేలలు ఎన్నో జీవరాశులు, మొక్కలకు ఆవాసంగా ఉంటాయన్నారు. సముద్ర తీర ప్రాంతంలో మాంగ్రూ మొక్కల పెరుగుదలకు పక్షుల పెరుగుదలకు తోడ్పడుతాయన్నారు. అనంతరం చిత్తడి నేలలను రక్షిద్దాం.. చింతలేకుండా జీవిద్దాం అనే అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఉమెరా తబస్సుమ్, రంగ సుబ్రహ్మణ్యం, సారా, లక్ష్మీప్రసన్న చిత్రలేఖనంలో, సునీత, రాధిక, రుష, అఫ్సా అంజుమ్ వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సుందర్ రావు, దీక్షా కో ఆర్డినేటర్ నాగేంద్రకుమార్, దేవనాల శ్రీనివాసులు, రాఘవేంద్ర, బాపూజీనాయక్, శేషఫణి, శ్రీనివాసరెడ్డి, గౌరీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర బడ్జెట్‌పై నిరసన



బడ్జెట్ కాపీలను దహనం చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం నాయకులు అన్నారు. నిధుల కేటాయింపులో రాష్ట్రానికి మొండిచేయి చూపిందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం తీరును నిరసిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీచౌక్‌లో కేంద్ర బడ్జెట్ కాపీలను దహనం చేశారు.అనంతరం సీపీఎం నాయకులు తోటమద్దులు, వెంకటలింగం మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్యాకేజీ, విభజన హామీల అమలు తదితర విషయాలను కేంద్రం పక్కన పెట్టిందన్నారు. కడప స్టీల్‌ప్లాంట్, వైజాగ్ మెట్రోకు నిధులు కేటాయింపు జరగలేదన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా ఎన్‌సీసీ ఏ - సర్టిఫికెట్ పరీక్ష

కర్నూలు కల్చరల్: ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 9 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్, 28 ఆంధ్ర బెటాలియన్ కేడెట్లకు ఆదివారం ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో ఏ సర్టిఫికెట్‌కు సంబంధించి థియరీ, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. 9 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ నుంచి 422 మంది, 28 ఆంధ్ర బెటాలియన్ నుంచి 455 మంది కేడెట్లు పరీక్షలకు హాజరయ్యారు. 9 ఆంధ్ర బెటాలియన్ గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్ జోబి ఫిలిప్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

# అక్రమాల అంతస్తులు!

- అహోబిలం క్షేత్రంలో నిబంధనలు బేఖాతరు
- అటవీ, దేవదాయ, ఇరిగేషన్ భూముల్లో అక్రమ నిర్మాణాలు
- ప్రజాప్రతినిధులే సూత్రధారులు
- 100కు పైగా లాడ్జీలు.. హోటళ్లు
- రూ. కోట్లు ప్రభుత్వ ఆదాయానికి గండి
- సెట్‌బ్యాక్ లేని భవనాలతో సమస్యలు తలెత్తే ప్రమాదం
- చోద్యం చూస్తున్న అధికారులు



ప్రధానరోడ్డులో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల వ్యాపార సముదాయం

ఆళ్లగడ్డ: ఆధ్యాత్మిక గ్రామమైన అహోబిలంలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఏమాత్రం అనుమతులు తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు జరుగుతున్నా అధికారులు ఏమాత్రం చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలు.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్న వీటి వెనుక కొందరు అధికారపార్టీ ప్రజా ప్రతినిధులు ఉన్నారనే ఆరోపణలున్నాయి.

**అక్రమాలకు 'రాజ'బాట**

ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో అహోబిలంలో గర్భగుడి గోపురం కంటే ఎత్తుగా నిర్మాణాలు చేపట్టకూడదు. అయితే, ఈ నిబంధన అమలు కావడం లేదు. నిరుపేద గిరిజనులకు నివాస గృహాల కోసం ప్రభుత్వం ఇచ్చిన డీ పట్టాలను సైతం కబ్జా చేసి బహుళ అంతస్తులు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దేవస్థానం చుట్టూ సుమారు 100కు పైగానే స్టార్ హోటళ్లను తలదన్నేలా ఏసీ, నాన్ ఏసీ అని బోర్డులు పెట్టి లాడ్జీలు నిర్మిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేని వీటికి విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇచ్చి మీటర్లు బిగిస్తున్నారు. ఈ పనికి రూ. లక్షలు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలన్నింటికీ గ్రామ పంచాయతీ నుంచే తాగునీరు సరఫరా, పారిశుద్ధ్యం పనులు జరుగుతున్నాయి. సదరు భవనాల యజమానులు ఉచితంగా సేవలు పొందుతూ పంచాయతీకి మాత్రం ఒక్క రూపాయి పన్ను చెల్లించడం లేదు. అక్రమార్కుల వెనుక అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఉండటంతో పంచాయతీ, కుడా, దేవస్థాన, అటవీ, ఇరిగేషన్, విద్యుత్, అగ్నిమాపక శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శల వెల్లువెత్తున్నాయి. సెట్‌బ్యాక్ లేకుండా జరుగుతున్న నిర్మాణలతో భవిష్యత్తులో ట్రాఫిక్‌తో పాటు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అత్యవసర సేవలు అందించాలంటే చాలా సమస్యలు ఎదురవుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**మాస్టర్ ప్లాన్ అమలు కాక..**

అహోబిలం క్షేత్రానికి దేశ విదేశాలనుంచి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. పండుగలు, సెలవులు, వారాంతాలు, ప్రత్యేక దినాల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. క్షేత్రానికి వచ్చే భక్తులతో పాటు స్వామి ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని మాస్టర్ ప్లాన్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాన్ అమలుకు దేవస్థాన పరిధిలోని 210 సర్వే నంబర్‌లో ఉన్న వారిని ఖాళీ చేయించడంతో పాటు దేవస్థానికి సంబంధించిన పురాతన మండపాలను సైతం కూల్చి వేశారు. తర్వాత కాటేజీలు, వసతి గృహాలు, కాలక్షేప మండపాలు, టికెట్ కౌంటర్లు, వితరణ కేంద్రాలు, అన్నదాన కూటములు, ఉద్యానవనాలు, వివిధ మండపాలు నిర్మించాలని మాస్టర్ ప్లాన్ తయారు చేశారు. నేటికి 10 సంవత్సరాలు అయినా ఆ ప్లాన్ అమలు కాకపోవడంతో స్థలంలో అక్రమ నిర్మాణాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. దీనిని పట్టించుకోవాల్సిన అధికారులు, దేవస్థానం నిర్వాహకులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నా

### ఇందిరమ్మ కాలనీలో ఇంద్రభవనం



ఇంద్ర భవనం తలపిస్తున్న ఈ నిర్మాణం ఇందిరమ్మ కాలనీలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల్లోనిది. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో సుమారు 20 ఎకరాలు సేకరించి 310 మందికి ఇళ్లు నిర్మించుకునేందుకు ప్లాట్లు వేసి అనుమతి ఇచ్చారు. పేదలకు సంబంధించిన ఈ స్థలంపై కన్నేసిన అక్రమార్కులు వాటిని ఆక్రమించుకుని బహుళ అంతస్తులు నిర్మించి లాడ్జీలుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి భవనాలు 50కి పైగా ఉన్నా నిర్వాహకులు ఒక్క రూపాయి కూడా ట్యాక్స్ చెల్లించడంలేదు. ఇందులో అనేక మంది గృహ అవసరాలకు ఉపయోగించే విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం.

### పేదల ఇల్లు కొని..లాడ్జీగా మార్చి



ఇక్కడ కనిపిస్తున్నది తమిళనాడు హోటల్. గతంలో ప్రభుత్వం ఓ నిరుపేదకు స్థలమిచ్చి ఇళ్లు నిర్మించి ఇచ్చింది. అయితే, తమిళనాడు చెందిన ఓ వ్యక్తి ఈ ఇంటిని కొనుగోలు చేసి లాడ్జీ కం హోటల్‌గా మార్చి వ్యాపారం కొనసాగిస్తున్నాడు. తమిళనాడుకు చెందిన సుమారు 100 మంది ఇలా ఇళ్లను తీసుకొని అక్రమంగా ఇలాంటి వ్యాపారాలు నిర్వహిస్తున్నా అధికారులు చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

### వేదం లేని పాఠశాల



ఇక్కడ కనిపిస్తున్న ఈ బహుళ అంతస్తుల భవనం. చుట్టుపక్కల ఉన్న స్థానికులకు వేదాలు నేర్పిస్తామని ఏర్పాటు చేసిన వేద పాఠశాల. ఈ స్థలానికి ఎటువంటి పట్టా లేకపోవడంతో పాటు చుట్టు మైనర్ ఇరిగేషన్, అటవీ పొలం కూడా ఆక్రమించుకుని అనుమతులు లేకుండా వేద పాఠశాల నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, ఇప్పుడు ఆ వేద పాఠశాల కాస్త ఆధునిక లాడ్జీగా మార్చి రూంలు బాడుగకు ఇస్తూ లక్షలు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### పుణ్యక్షేత్రంలో పాప కార్యం

నవనారసింహులు కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రానికి భక్తిభావంతో నిత్యం ఎందరో భక్తులు వస్తుంటారు. దీనిని అవకాశంగా తీసుకొని కొందరు ఈ అక్రమ లాడ్జీలను అపవిత్ర కేంద్రాలుగా మలుచుకుంటున్నారు. ఎటువంటి గుర్తింపు లేని ఈ లాడ్జీలను రూ. లక్షలు చెల్లించి లీజుకు తీసుకుంటున్నారు. వీరి వద్ద రిజిస్టర్‌లు, రసీదులు ఏమీ ఉండవు. అవసరాన్ని, అవకాశాన్ని బట్టి ఇష్టమొచ్చినట్లు డబ్బులు వసూలు చేసుకుంటూ గదులు ఇస్తున్నారు. దీంతో ఈ మధ్య కాలంలో అనేక ప్రేమ జంటలు, వివాహేతర సంబంధాల వ్యక్తులు, మందుబాబులు ఇక్కడ గదులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో ఉండే వారు ఇబ్బందులకు గురవుతున్నారు.

### కాల్వను కబ్జా చేసి..



ఇక్కడ అత్యాధునిక హంగులతో కనిపిస్తున్న ఈ భవన సముదాయం చెరువు కాల్వ స్థలంలో ఉంది. ఇలా కాల్వను పూడ్చి సుమారు 30 దాకా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నారు. పూర్వం అహోబిలం దేవస్థానానికి అవసరమైన నీటికోసం నల్లమల అడవిలో 'మఠమోళ్ల చెరువు' నిర్మించి అక్కడి నుంచి దేవాలయం ప్రాంగణం వరకు సుమారు మూడు కి.మీ. మేజర్ కాలువ తీశారు. ప్రస్తుతం కాలువ పూర్తిగా కబ్జాకు గురై అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా సంబంధిత శాఖ అధికారులు అడ్డుకోలేక పోతున్నారు.

### నయాపైసా చెల్లించడం లేదు



గ్రామంలో 150 దాకా సొంతంగా లాడ్జీలు కట్టుకుని లక్షలు సంపాదించుకుంటున్నారు. ఒక్కరు కూడా నయాపైసా పన్ను చెల్లించలేదు. వారికి అవసరమైన నీళ్లు కూడా పంచాయతీనే సరఫరా చేస్తుంది. కనీసం నీటి పన్ను అయినా వసూలు చేయమని చెబుతుంటే అధికారులు పట్టించుకోవడంలేదు.

– నాసారి ఈరమ్మ, సర్పంచ్, అహోబిలం

### చర్యలు తీసుకుంటాం



కమర్షియల్ నిర్మాణాలకు తప్పనిసరిగా అన్నిరకాల అనుమతులు ఉండాలి. అయితే, ఇక్కడ దాదాపుగా నిర్మాణాలన్నీ అటవీ, దేవదాయ, రెవెన్యూ, జలవనరుల శాఖల పరిధిలో ఉన్నవే. వీటన్నింటికి పన్నులు వసూలు చేసి రసీదులు ఇస్తే వాటితో హక్కుగా కోర్టులకు వెళ్లే అవకాశం ఉంటుందని పన్నులు వసూలు చేయడం లేదు. ఇప్పుడు నిర్మాణంలో ఉన్నవాటికి నోటీసులు ఇచ్చి పనులు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– అశ్విన్, ఈఓపీఆర్డీ

# వైభవంగా వసంత పంచమి

- కొలనుభారతిదేవి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు
- సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- పట్టు వస్త్రాలు సమర్పించిన శ్రీశైలదేవస్థానం
- చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం



అమ్మవారి క్షేత్ర ప్రాంగణంలో చిన్నారులకు సాముహిక అక్షరాభ్యాసం



సరస్వతీదేవి అలంకారంలో కొలనుభారతి దేవి

కొత్తపల్లి: నల్లమల అటవీ ప్రాంతంలోని శివపురం గ్రామం శివారులో వెలసిన కొలనుభారతి దేవి క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ ఈఓ రామలింగారెడ్డి, దేవదాయ శాఖ జిల్లా ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ మోహన్, ఆలయ ఛైర్మన్ వెంకటనాయుడు ఆధ్వర్యంలో అమ్మవారిని జ్ఞాన స్వరూపిణి సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి అభిషేకం, సర్వసతి హోమాలు, చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు.

**పట్టువస్త్రాల సమర్పణ**

శ్రీశైలం దేవస్థానం సూపరింటెండెంట్ నాగేశ్వరరావు ఆలయ వేద పండితులతో కలిసి ఉదయం కొలనుభారతి దేవి క్షేత్రానికి చేరుకొని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, ఆర్డీఓ నాగజ్యోతి, సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, ఎంపీపీ కుసుమలత, తహసీల్దార్ ఉమారాణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**తరలివచ్చిన భక్తులు**

వసంత పంచమి సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమ అఖిల ప్రియ, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి పట్టాభి, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, తహసీల్దార్లు చంద్రశేఖర్ నాయక్, శ్రీనివాసులు, ఎంపీటీసీ శివన్న, సర్పంచు నిత్యలక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, మాజీ సింగల్ విండో ఛైర్మన్ జనార్దన్ రెడ్డి, అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

**వేడుకగా అక్షరాభ్యాసాలు**

సర్వసతీదేవి పుట్టిన రోజును పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం వేడుకగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ చిన్నారులకు అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయించారు. 510 మంది చిన్నారులకు వేదపండితుల సమక్షంలో బీజాక్షరాలు దిద్దించారు. కాగా క్షేత్రం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, ఎస్‌ఐ కేశవ ఆధ్వర్యంలో 50 మంది పోలీసు సిబ్బందితో భద్రత కల్పించారు.

# ప్లీజ్.. డీసీసీబీ సీఈఓ పోస్టు ఇవ్వండి

- డీజీఎం నాగిరెడ్డి ముమ్మర యత్నాలు
- ఆప్కాబ్ ఎండీతో సహా ఛైర్మన్, మంత్రులకు లేఖలు



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్రబ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా నియమితులయ్యేందుకు అదే బ్యాంకులో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న నాగిరెడ్డి ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. తనను సీఈఓగా నియమించాలని ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు, సహకరించాలని వ్యవసాయ, అనుబంధ శాఖలు, సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఆప్కాబ్ ఛైర్మన్‌లకు ప్రత్యేకంగా లేఖలు కూడా రాసినట్లు తెలుస్తోంది. ఖాళీగా ఉన్న డీసీసీబీ సీఈఓ పోస్టును భర్తీ చేసేందుకు గత ఏడాది ఆప్కాబ్ నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో డీసీసీబీ డీజీఎం నాగిరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. గత ఏడాది నవంబరులో జరిగిన ఇంటర్వ్యూకు కూడా హాజరయ్యారు. అయితే, ఆయనపై కొందరు ఫిర్యాదులు చేయడం వల్ల సీఈఓ ప్యానల్‌లో చోటు దక్కలేదు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జీఎంగా పని చేసి పదవీ విరమణ చేసిన వెంకటేశ్వరస్వామిని డిసెంబరు నెల చివరిలో డీసీసీబీ సీఈఓగా నియమించారు. అయితే, ఈ పోస్టులో ఆయన చేరలేదు. ఇటీవల నాట్ ఇంట్రెస్ట్ అంటూ డీసీసీబీకి సమాచారమిచ్చారు. దీంతో డీజీఎం నాగిరెడ్డి మళ్లీ తన ప్రయత్నాలను ప్రారంభించారు. ఇటీవల ఆప్కాబ్ ఎండీ, మంత్రులకు తనను సీఈఓగా నియమించాలని కోరుతూ లేఖ రాసినట్లు డీసీసీబీలో జోరుగా చర్చ జరుగుతోంది.యూబీఐ అనుమతి లేక పోయినప్పటికీ వెంకటేశ్వరస్వామిని ఇంటర్వ్యూకు పిలువడం, సీఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంలో పొరపాటు చేశారని లేఖలో ప్రస్తావించినట్లు సమాచారం. తాను దివ్యాంగుడినని, దీనిని దృష్టిలో పెట్టుకొని ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా అవకాశం కల్పించాలని ఆప్కాబ్ ఎండీ, మంత్రులను కోరినట్లు తెలిసింది.

## మధురం.. 'సుగంధం'



అరటి గెలను కొనుగోలు చేస్తున్న భక్తులు



ప్రస్తుతం స్వచ్ఛమైన పండు తిందామన్నా, సహజ సిద్ధంగా పండించిన ధాన్యం తీసుకుందామన్నా దొరకని పరిస్థితి. అయితే మహానంది సమీపంలో సాగు చేసే సుగంధం అరటి తోటల్లోని గెలలను ఎలాంటి రసాయనాలు లేకుండా మాగబెట్టి అమ్ముతున్నారు. నంద్యాల నుంచి మహానంది వరకు వెళ్లే మార్గంలో సుమారు 20కిపైగా అరటిపళ్ల దుకాణాలు దర్శనమిస్తున్నాయి. ఒక్కొక్క గెల సైజును బట్టి రూ. 120 నుంచి రూ. 200 వరకు విక్రయిస్తూ పలు కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయి. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు స్వచ్ఛంగా కనిపించే సుగంధం రకపు అరటి పండ్లను కొనుగోలు చేస్తూ ఇళ్లకు తీసుకెళ్తున్నారు. – మహానంది

# ఉరుకుంద క్షేత్రం .. ఉత్సవ వైభవం

- రెండోరోజు శాస్త్రోక్తంగా సాగిన హోమాలు
- కనుల పండువగా గ్రామోత్సవం
- ఆకట్టుకున్న సంప్రదాయ ప్రదర్శనలు



నందికోలు ప్రదర్శన

మంత్రాలయం/కౌతాళం: వేద మంత్రాలు.. మంగళవాయిద్యాలు, కోలాటాలు, నందికోల, వీరభద్ర వేషధారుల ప్రదర్శనలతో ఉరుకుంద క్షేత్రం పులకించింది. ఈరన్న స్వామి ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా రెండో రోజు ఆదివారం ఉదయం యాగశాలలో వైశాగమ ప్రవీణ సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో రుద్రహోమం, చండీహోమం, మహా సుదర్శన హోమం, మృత్యుంజయహోమం, శాంతి హోమాలు నిర్వహించారు. అనంతరం ధాన్యదివాసంలో ఉన్న విగ్రహాలు, కలశాలకు సంప్రోక్షణ, పంచామృతాభిషేకం చేశారు. అక్కడి నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక కొలను వరకు ఊరేగింపుగా చేరుకుని దేవతామూర్తులు, కలశాలను జలాధివాసం చేశారు. ఈ ఘట్టం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం వేద ఘోషతో యాగశాల మార్మోగింది. ఆలయ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలను జిల్లా డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ పర్యవేక్షించారు. ఏర్పాట్లపై ఆరా తీసి విగ్రహాలను పరిశీలించారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై రాత్రి కల శాలు, దేవతా విగ్రహాలకు ఉంచి ఆలయం ప్రధాన ముఖద్వారం నుంచి అర కిలోమీటర్ దూరంలోని ఉరుకుంద గ్రామం వరకు ఊరేగింపు నిర్వహించారు.



ప్రత్యేక రథంపై కొలువైన దేవతామూర్తులు

## క్లుప్తంగా

### నాలుగు గడ్డివాములు దగ్ధం

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్.కైరవాడిలో గ్రామంలో ఆదివారం సాయంత్రం నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన చాకలి శ్రీనివాసులు, భీమరాయుడు తమ ఇంటి సమీపంలో పశువుల మేత కోసం నాలుగు గడ్డివాములు వేసుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం గడ్డి వాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. స్థానికులు బిందెలతో నీటిని చల్లి మంటలను ఆర్పివేసేందుకు ప్రయత్నం చేశారు. మంటలు పక్కనున్న గడ్డి వాములకు విస్తరించకుండా అదుపుచేశారు. అలాగే కోడుమూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. బాధిత రైతులు మాట్లాడుతూ.. నాలుగు గడ్డివాములు దగ్ధం కావడంతో దాదాపు రూ.2 లక్షలు నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

### విద్యార్థి ఆత్మహత్య

శ్రీశైలంప్రాజెక్ట్: బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న విద్యార్థి ఆదివారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. సున్నిపెంట వైజాగ్ కాలనీకి చెందిన మల్లికార్జున, భ్రమరాంబ దంపతుల కుమారుడు మేడిశెట్టి సుధీర్ (20) మార్కాపురంలో బీఎస్సీ నర్సింగ్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. చదువులో వెనకబడి తరచూ సబ్జెక్ట్‌ల్లో ఫెయిల్ అవుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు టూటౌన్ ఎస్‌ఐ బి.వి.సుబ్బారెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

### బస్సు క్లీనర్ దుర్మరణం

ఆళ్లగడ్డ: ప్రైవేటు బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో బస్సు క్లీనర్ యూకేశ్ (30) మృతి చెందిన ఘటన ఆదివారం ఆళ్లగడ్డ పట్టణ శివారులో చోటు చేసేకుంది. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఆళ్లగడ్డ పట్టణ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నిజామాబాద్‌కు చెందిన బస్సు క్లీనర్ యూకేశ్ మృతి చెందాడు. బస్సులోని ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ నగీన తెలిపారు.

### వక్ఫ్ చట్ట సవరణను విరమించుకోవాలి

కర్నూలు(సెంట్రల్): వక్ఫ్ చట్ట సవరణను విరమించుకోవాలని ఆవాజ్ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్‌హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక గడియారం ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో మైనార్టీలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం వారి ఆస్తులపై కన్నేయడం అన్యాయమన్నారు. వక్ఫ్ ఆస్తుల గురించి బీజేపీకి ఎందుకని ప్రశ్నించారు. వక్ఫ్ ఆస్తులను ఆయా సంస్థలు సక్రమంగా నిర్వహించుకోగలవన్నారు. వెంటనే వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. నాయకులు మహబూబ్‌బాషా, ఖాజాపాషా, సలీం పాల్గొన్నారు.

# గ్రాసం.. అడవికి జీవం

- పర్యావరణ పరిరక్షణకు గడ్డి మైదానాలు పెట్టని కోటలు
- పర్యావరణ అగ్రసూచి పులి సంరక్షణకు కీలకం
- నల్లమలలో గడ్డి మైదానాల అభివృద్ధికి చర్యలు
- ప్రణాళికలు తయారు చేసిన గ్రాస్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ మురాత్కర్



పుష్కలమైన గడ్డి, నీటి సౌకర్యం జింకల పాలిట స్వర్గం



సేకరించిన గడ్డి విత్తనాలు, కాయలు

ఆత్మకూరురూరల్: గడ్డి పరక అన్నది అత్యంత తూష్ణీకరణకు పర్యాయ పదంగా వాడే వస్తువు. కానీ సమస్త జీవరాసులు సమతుల్య జీవనం గడిపేందుకు గడ్డి పరకలే కీలకమైన పాత్ర పోషిస్తాయంటే నమ్మడం కష్టమే.. కానీ ఇది నిజం. అందుకే జీవ వైవిధ్యానికి ఆసియాలోనే అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న తూర్పు కనుమల్లో భాగమైన నల్లమల అడవుల్లో గడ్డి మైదానాల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలకు అటవీ శాఖ శ్రీకారం చుట్టింది. గ్రాస్ మాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన డాక్టర్ మురాత్కర్ నల్లమలలో అధ్యయనం చేసి రూపొందించిన ప్రణాళికను ఆయన ఇటీవల స్వయంగా నాగార్జునసాగర్ – శ్రీశైలం పులుల అభయారణ్యం పరిధిలోని ఆత్మకూరు, నంద్యాల, మార్కాపురం డివిజన్లలో పర్యటించి అటవీ అధికారులకు, సిబ్బందికి వివరించారు.

### పర్యావరణ పరిరక్షణలో గడ్డి ప్రాధాన్యత

పర్యావరణ పరిరక్షణలో ఊహాత్మక పిరమిడ్‌లో పెద్ద పులిని అగ్రసూచిగా గుర్తిస్తారు. పులిని ప్రధాన పరిరక్షక వన్యప్రాణిగా కేంద్రీకరించి దాని చుట్టూ చేపట్టే సంరక్షణ చర్యలు యావత్తు పర్యావరణ పరిరక్షణ దిశగా సాగుతాయి. అందులో పులి ఆహారం, ఆవాసం, ఆహార జంతువులు, వాటి ఆహార సంరక్షణ కూడా ఇమిడి ఉంటాయి. దీంతో కొండలు, కోనలు, వెదురు వనాలు, దట్టమైన అడవి, అందులో గడ్డి మైదానాలు, నీటి తావుల రక్షణ వెరసి పర్యావరణ పరిరక్షణ సంపూర్ణమవుతుంది. ఇందులో ప్రధానమైనది పులి ఆహారం. పులి ఆహారమైన గడ్డి తినే వన్యప్రాణుల సంఖ్య తగ్గకుండా చూడటం ఒక బృహత్తరమైన పులి సంరక్షణ చర్య. వాటి సంఖ్య తగ్గకూడదు అంటే వాటి ఆహారమైన గడ్డి పుష్కలంగా అందుబాటులో ఉండాల్సి ఉంది. అందుకోసం అవసరమైన గడ్డి మైదానాలను శాస్త్రీయ పద్ధతిలో క్రమబద్ధీకరించి గడ్డి తినే వన్యప్రాణులకు అందుబాటులో ఉంచాలి.

### బయోమాస్ మేనేజ్‌మెంట్

అడవిలో వన్యప్రాణుల ఆహారంగా పనికిరాని చీపురు పుల్లల గడ్డిని తొలగించడంతో పాటు వినియోగించకుండానే ముదిరిపోయే గడ్డిని తొలగించే పద్ధతిని బయోమాస్ మేనేజ్‌మెంట్ అంటారు. ఈ పద్ధతిలో విత్తనాలు ఏర్పడే ముందుగా ఈ గడ్డిని భూమి లెవెల్‌కు కోసి వేయడం ద్వారా లేత గడ్డి చిగురించేలా చేస్తారు. అంతేగాకుండా కంట్రోల్ ఫైరింగ్ (ఎండు గడ్డిని తక్కువస్థాయి మంటతో తగలబెట్టడం) ద్వారా ఎండు గడ్డిని తొలగించి చిగురు వేసేలా చేస్తారు.

### గ్రాస్ మ్యాన్ కృషి

మురాత్కర్ మహారాష్ట్రలోని అమరావతిలో ఉన్న చికల్దర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బాటనీ అండ్ ఎన్విరాన్ మెంటల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా ఉన్నారు. తను పనిచేస్తున్న కళాశాలకు సమీపంలో మేల్ఘాట్ టైగర్ రిజర్వ్‌తో ఉన్న అనుబంధం వల్ల ఈయనకు పులి సంరక్షణలో గడ్డి మైదానాల పాత్రపై అవగాహన ఏర్పడింది. ఈ అంశంపై ఆయన ఎంతో కృషి చేశారు. మహారాష్ట్రలోని తోబాడ్, అంధేరి, ఫించ్ వంటి టైగర్ రిజర్వ్‌లలో తన సేవలందించారు. ఆయన తిరగని, సూచనలివ్వని పులుల అభయారణ్యం భారతదేశంలో లేదు. 2013లో ఈయనకు గ్రీన్ టీచర్స్ అవార్డ్ వచ్చింది. ఈయన సేవలను గుర్తించిన వన్యప్రాణి సంరక్షక ప్రపంచం ఈయన్ను గ్రాస్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా గుర్తించి పిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆఫ్రికా నుంచి చీతాలను తెప్పించి మధ్యప్రదేశ్‌లో వదలిన కునే నేషనల్ పార్క్‌లో కూడా గడ్డి మైదానాల పర్యవేక్షణ కూడా డాక్టర్ మురార్కర్ ఆధ్వర్యంలో జరిగింది. ఇటీవల ఆయన నల్లమలలోని ఎన్ఎస్‌టీఆర్‌లో ఆత్మకూరు, నంద్యాల, మార్కాపురం డివిజన్‌లలో పర్యటించి సిబ్బందికి గడ్డి మైదానాల అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు.



నల్లమలలో గడ్డి మైదానాల్లో డాక్టర్ మురార్కర్ శిక్షణ

### ఎన్ఎస్‌టీఆర్‌లో గడ్డి మైదానాలు

నాగార్జునసాగర్ – శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్)లో 1,33,122 హెక్టార్లలో గడ్డి మైదానాలు ఉన్నాయి. వీటిలో ఏకదళ, ద్విదళ గడ్డి జాతులు అందుబాటులో ఉన్నాయి. ఎన్ఎస్‌టీఆర్ చుట్టూ సుమారు 200 గ్రామాలు అడవిని ఆనుకుని ఉన్నాయి. వీటిల్లో సుమారు ఆరు లక్షల ఆవులు, బర్రెలు ఉన్నాయి. ఇవన్నీ నల్లమలలోని గడ్డి మైదానాలను వన్యప్రాణులతో కలిసి పంచుకుంటున్నాయి. ఎన్ఎస్‌టీఆర్‌లోయేడాదికి గడ్డి లభ్యత 3,86,053 టన్నులుగా ఉంది. గడ్డి తినే వన్యప్రాణుల సంఖ్యతో పోలిస్తే ఏటా 6.934 లక్షల టన్నుల గడ్డి అవసరం ఉంది. గ్రామీణ పశు సంపద నుంచి ఉన్న పోటీ కారణంగా 3.073 టన్నుల గడ్డి ఏటా అదనంగా ఉత్పత్తి కావాల్సిన అవసరముంది. దీంతో డిమాండ్‌కు సప్లయ్‌కి మధ్య తేడా భారీగా కనబడుతోంది. దీంతో పులి ఆహార జంతువులైన జింకలకు అవసరమైన మేర గడ్డి మైదానాలు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అలాగే గ్రామీణ పాడి పశువులను స్టాల్ ఫీడింగ్‌కు పరిమితం చేస్తూనే పెరుగుతున్న హెర్బీవోర్స్ దామాషాకు సరిపడా గడ్డి మైదానాలలో గడ్డి ఉత్పత్తికి చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### గడ్డి మైదానాల అభివృద్ధికి డాక్టర్ మురాత్కర్ చేసిన సూచనలు



- గడ్డి మైదానాల మృత్తికా స్వభావం, రంగుల పరిశీలన
- ప్రాంతంలో ఉన్న వార్షిక, బహువార్షిక గడ్డి జాతులను గుర్తించడం
- జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కలుపు మొక్కల నిర్మూలన
- నవంబరు నుంచి జనవరి వరకు గడ్డి గింజల సేకరణ
- గడ్డి గింజలను 13 రోజులు ఎండబెట్టడం
- మే 25 నుంచి జూన్ 10వ తేదీ వరకు గడ్డి గింజలను గుర్తించిన మైదానాల్లో చల్లడం. ఇందుకోసం సీడ్ బాల్ పద్ధతిని వినియోగించుకోవడం
- కేవలం వన్యప్రాణులు తినే గడ్డి మాత్రమే గాక కీటకాలను ఆకర్షించే పుష్పాలను కలిగి ఉండే గడ్డి మొక్కలను కూడా గుర్తించాలి.
- 3 నుంచి 5 సంవత్సరాలకు సరిపడా గడ్డి మైదానాల అభివృద్ధి ప్రణాళిక తయారు చేసుకోవాలి.

# రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



మృతి చెందిన వెంకటరాముడు

డోన్ రూరల్: మండల పరిధిలోని ఓబులాపురం మిట్ట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తబురుజు గ్రామానికి చెందిన బసినేని వెంకటరాముడు (87) అనే వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. వెంకటరాముడు సొంత గ్రామమైన కొత్తబురుజు నుంచి శనివారం కాశిరెడ్డి నాయన ఆలయం వద్ద నిద్ర చేయడానికి వచ్చాడు. ఆదివారం ఉదయం నిద్రలేచి బహిర్భూమికి వెళ్లి పక్కనే ఉన్న 44వ జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వెంకటరాముడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందిచడంతో మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

# ఏపీపీఎస్ఈ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ ఫార్మా సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (ఏపీపీఎస్ఈ) అసోసియేషన్ కర్నూలు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం స్థానిక ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆలిండియా వైస్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు బండారు దస్తగిరియాదవ్, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరయ్యారు. వీరు జాతీయ ఫార్మా కంపెనీల విషయాలు, కార్మికుల హక్కుల గురించి ప్రస్తావించి చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఎస్.సత్యనారాయణయ్య, ఉపాధ్యక్షుడిగా తులసిరెడ్డి, సెక్రటరీగా వై.రామాంజులురెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఉపేంద్రయాదవ్, కోశాధికారిగా శ్రీరామ పుల్లయ్య, సహాయ కోశాధికారి విక్రమ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ సభ్యులు గెట్ టు గెదర్ నిర్వహించి కుటుంబసభ్యులతో కార్యక్రమానికి హాజరై ఆనందాన్ని పంచుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

### సేవాలాల్ జయంతి అధికారికంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కైలాస్‌నాయక్

కర్నూలు(అర్బన్): దేశంలో 15 కోట్లకు పైగా జనాభా కలిగిన బంజారాల ఆరాధ్య దైవం, గురువు, సంఘ సంస్కర్త సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కైలాస్‌నాయక్ కోరారు. ఆదివారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని ఎల్‌హెచ్‌పీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 40 నియోజకవర్గాల్లో ఉన్న బంజారా ప్రజల కోసం ఈ నెల 13, 14, 15 తేదీల్లో ప్రతి మండల కేంద్రంలో మహారాజ్ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వమే ఘనంగా నిర్వహించాలన్నారు. అలాగే జయంతి రోజును రాష్ట్ర పండుగగా గుర్తించి సెలవు దినంగా ప్రకటించాలన్నారు. గోర్ సంస్కృతి నిర్వహణ కమిటీ సభ్యుడు రంగస్వామినాయక్, సీమ కృష్ణ రాథోడ్, నేనావత్ రామునాయక్, రామాంజనేయ చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఆదిత్యుడికి కిరణాభిషేకం



మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని శ్రీ గంగా, గౌరీ సమేత మరకత లింగేశ్వర, నవగ్రహ దేవాలయాల వద్ద ఆదివారం అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. సూర్య భగవానుడి ఆలయంలో కొలువైన స్వామివారిపై ప్రత్యక్ష దైవంగా భావించే సూర్యుడి కిరణాలు తాకడం విశేషం. సూర్య దేవుడికి ఇష్టమైన ఆదివారం రోజున అర్చకులు అభిషేకం చేస్తున్న సమయంలో విగ్రహంపై కిరణాలు పడటం విశేషమని ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు తెలిపారు.

# తెలుగు భాషా సేవకుడికి పురస్కారం



అవార్డు అందుకుంటున్న దత్తాత్రేయశర్మ

ఆదోని అర్బన్: ప్రముఖ జ్యోతిష్యవేత్త, ఉపాధ్యాయుడు గరుడాద్రి దత్తాత్రేయ శర్మకు స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ పురస్కారం లభించింది. ఆయన ఉపాధ్యాయుడిగా, ఉపన్యాసకుడిగా దాదాపు 23 సంవత్సరాలుగా తెలుగు భాషకు కరసేవకుడిగా సేవలందిస్తున్నారు. గరుడాద్రి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏటా తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తూ విశ్రాంత ఉపాధ్యాయులు, విలేకరులను సత్కరించేవారు. విద్యార్థులకు తెలుగు భాషలో అనేక పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేయడం, తెలుగు క్రీడ కబడ్డీని ప్రోత్సహిస్తూ జెర్సీలను అందజేయడం, విజేతలకు వెండి పతకాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సాహితీ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా వసంత పంచమి పండుగను పురస్కరించుకుని ఆదివారం విజయవాడలోని శ్రీ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ పురస్కారం–2025, కాంస్య నంది అవార్డును సన్మాన పత్రాన్ని ఇచ్చి సత్కరించారు.

# దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్ర

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డు కులాల ఉప వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మాల జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా, క్రిమిలేయర్‌ను రద్దు చేయాలనే పలు డిమాండ్లపై ఈ నెల 23వ తేదీన స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల మైదానంలో జరగనున్న రాయలసీమ 'మాలల యుద్ధ గర్జన' భారీ బహిరంగ సభకు సంబంధించి జేఏసీ నేతలు సన్నాహక సమావేశం నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ యాట ఓబులేష్ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ ఎస్.నాగప్ప వీధి చెన్నకేశవ హాల్‌లో జరిగిన ఈ సమావేశానికి గోన నాగరాజు, దామోదరం రాధాకృష్ణ, కే.మాధవస్వామితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. మాలల యుద్ధ గర్జనకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నేతలు మాట్లాడుతూ.. మాల మాదిగలను విడగొట్టాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో తప్పుడు సర్వేలు చేయిస్తున్నారన్నారు. మాలలను అణచివేసేందుకు టీడీపీ, బీజేపీ పన్నుతున్న కుట్రలను మాలలు తిప్పి కొడతారన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ కాకుండా, సుప్రీంకోర్టు తీర్పు కేవలం గైడ్‌లైన్స్ మాత్రమేనని, జడ్జిమెంట్ కాదన్నారు. ఎస్సీ కులగణన చేసి 23 శాతం రిజర్వేషన్ పెంచాలనే డిమాండ్లపై జరగనున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జనకు లక్షలాదిగా మాలలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే అంబేడ్కర్ విగ్రహం ముందు గర్జనను విజయవంతం చేయాలని నినాదాలు చేశారు. నాయకులు ఎలీషా, శీలం శేషు, వేల్పుల జ్యోతి, సాంబశివుడు, రాజకుమార్, కుందా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యపు నీడలో 9వ శతాబ్దపు శిల్పాలు



శిల్పాలను పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు డాక్టర్ శివనాగిరెడ్డి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కల్లూరు మండలంలోని నాయకల్లు గ్రామంలో 9వ శతాబ్దానికి చెందిన (రాష్ట్ర కూటుల కాలానికి చెందిన) అపురూప శిల్పాలు ఆలనా.. పాలన లేక ముళ్ల కంచెల్లో నిర్లక్ష్యంగా పడి ఉన్నాయని పురావస్తు పరిశోధకుడు, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి (సీసీవీఏ), ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. ఈ శిల్పాలను పరిరక్షించాలని కోరారు. మొగల్రాజపురం మధుచౌక్‌లోని సీసీవీఏ కార్యాలయంలో శివనాగిరెడ్డి ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. సీసీవీఏ చేపట్టిన 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టెరిటీ' కార్యక్రమంలో భాగంగా నాయకల్లు గ్రామాన్ని ఆదివారం సందర్శించినట్లుగా చెప్పారు. ఆ గ్రామానికి ఉత్తరంగా ఉన్న ముళ్లపొదల్లో రాష్ట్ర కూటుల కాలపు నిలువెత్తు ఎర్ర ఇసుక రాతి శివ ద్వారపాలుడు, నల్ల శాసనపు రాతిలో చెక్కిన రెండు మహిషాసురమర్దిని శిల్పాలు, ఒక వీరగల్లు శిల్పంతో పాటుగా పొలాల్లో ఉన్న శిథిల శివాలయాల పక్కన ముళ్ల పొదల్లో నంది విగ్రహం ఉన్నాయని వెల్లడించారు. 1100 ఏళ్ల నాటి చరిత్ర, సంస్కృతికి ఈ శిల్పాలు అద్దం పడుతున్నాయన్నారు. రెండు మహిషాసుర్లమర్దిని శిల్పాలు అనాటి శక్తి ఆరాధనను, శత్రువులతో వీరోచితంగా పోరాడి ప్రాణాలు కోల్పోయిన వీరుడు స్వర్గాన్ని చేరుకోగా, అతనికి అప్సరసలు పరిచర్యలు చేస్తున్నట్లు తెలిపే నిలువెత్తు వీరగల్లు శిల్పం అనాటి వీర ఆరాధనను తెలియజేస్తున్నాయన్నారు. ఈ శిల్పాలను కాపాడుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు వీటి ప్రాధాన్యతను తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# పెళ్లి వేడుకపై దాడి అనాగరికం



బాధిత మహిళలను పరామర్శిస్తున్న మద్దూరు సుభాష్ చంద్రబోస్

సి.బెళగల్: బ్రాహ్మణదొడ్డిలో పెళ్లి వేడుకపై దాడి చేసి, నూతన వధువరులు, వారి బంధువులను తీవ్రంగా గాయపరచడం అనాగరిక చర్య అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూర్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆయన ఆదివారం సి.బెళగల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బాధిత కుటుంబాల మహిళలను పరామర్శించారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, బాధితులు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. పెళ్లి వేడుకలో భాగంగా వైఎస్సార్‌సీపీ వర్గీయులు జరుపుకుంటున్న ఊరేగింపు (మెరవని)పై దుండగులు రాళ్లు, ఇనుపరాడ్లు, వేట కొడవళ్లతో దాడికి పాల్పడటం అనాగరికమైన చర్య అన్నారు. అనంతరం బాధిత కుటుంబాల మహిళలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. దాడిలో గాయపడిన వారు చావుబతుకుల మధ్య ఉంటే వారి కుటుంబ సభ్యులను పోలీసులు స్టేషన్‌కు తీసుకురావడం సరికాదని ఆక్షేపించారు. వచ్చే సర్పంచ్ ఎన్నికలలో తమకు పోటీ ఉండకూడదని హెచ్చరికలతో అధికార పార్టీ అండ చూసుకొని దుండగులు రెచ్చిపోయి దాడులకు పాల్పడ్డారన్నారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



### మీరు వాలితే.. ప్రకృతి పరవశించదా!



ముచ్చట్లు చెప్పుకుంటూ.. చిటారు కొమ్మన కొంగలు

తూనీగ.. తూనీగ.. ఈ రంగెలా ఉందో చెప్పవా..?

అచ్చం నీలాగే.. అందమైన సీతాకోక చిలుకలు

ప్రకృతి ఒడిలో కాసేపు విహరిస్తే మనస్సుకు ఎంతో ఆహ్లాదం. చెట్టు, పుట్ట, పశుపక్ష్యాదులను దగ్గరగా చూస్తే ఏదో తెలియని అనుభూతి. పచ్చని చెట్లపై తెల్లని కొంగలు, లేలేత ఆకులపై అందాల సీతకోక చిలుకలు. రంగురంగుల తూనీగలను చూస్తే 'ఎన్నెన్నో వర్ణాలు.. అన్నింటా అందాలు' అంటూ పాడాల్సిందే. మహానందిలోని అటవీ పర్యావరణ కేంద్రం, ఆలయ పరిసరాల్లో పచ్చటి చెట్లు, పక్షుల కిలకిలరావాలు, సీతాకోక చిలుకలు, కీటకాలు ఆకట్టుకుంటున్నాయి. – మహానంది

# అక్రమ రిజిస్ట్రేషన్ సూత్రధారి ఎవరో?

- ఇప్పటివరకు పది మందిపై కేసు నమోదు
- పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకోవడంలో పోలీసుల వైఫల్యం
- పాత్రధారుల అరెస్ట్‌తో సరిపెట్టిన వైనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆదోని పట్టణంలో సంచలనమైన రూ.40 కోట్ల ఆస్తి అక్రమ రిజిస్ట్రేషన్ కేసు వ్యవహారం వెనుక సూత్రధారి ఎవరనేది నెల రోజులు గడిచినా ఇంకా తేలలేదు. కేవలం పాత్రధారులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారే కానీ, రూ.కోట్ల విలువైన భూ బాగోతాన్ని వెనుక ఉండి నడిపింది ఎవరనేది అంతు చిక్కడం లేదు. గతేడాది డిసెంబర్ 31వ తేదీన పట్టణంలో రూ.40 కోట్లు విలువ చేసే 6.51 ఎకరాల భూమి అక్రమ రిజిస్ట్రేషన్ జరిగినట్లు గత నెల 4వ తేదీన వెలుగు చేసింది. బాధితుడు ఎగ్గటి ఈశ్వరప్ప ఫిర్యాదు మేరకు ఈ కేసులో టూటౌన్ పోలీసులు పది మందిపై కేసు నమోదు చేశారు. ఎగ్గటి ఈశ్వరప్ప మరణించాడని, తాను ఆయన కుమారుడినని నంద్యాలకు చెందిన ఆముదాల భాస్కర్ నకిలీ డెత్, ఫ్యామిలీ సర్టిఫికెట్‌లను సృష్టించి భూ ఆక్రమణకు పథకం రూపొందించాడు. ఈ క్రమంలో గోనెగండ్ల మండలానికి చెందిన చాకలి ఈరన్నకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన విషయం విధితమే. చాకలి ఈరన్న మరో ఇద్దరు రైతుల నుంచి రూ.20 లక్షలు తీసుకుని రెండు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే కేసు నమోదై నెల రోజులు గడిచినా ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌లో సూత్రధారి ఎవరనేది తేల్చడంలో పోలీసులు తాత్సారం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

### ఎవరా నేత?

కోట్లాది విలువైన భూమిని ఆక్రమించేందుకు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన వ్యక్తి ఆముదాల భాస్కర్. ఇతను నంద్యాల జిల్లా వాసి. సదరు భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి ఎమ్మిగనూరు నియోజకవర్గం పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన చాకలి ఈరన్న. వీరంతా కలిసి ఆదోని సమీపం మండిగిరి పంచాయతీ పరిధిలో 6.51 ఎకరాల భూమిని కాజేసేందుకు కుట్ర పన్నారు. రిజిస్ట్రేషన్ ప్రకారం సదరు భూమి విలువ ఎకరం రూ.3.90 కోట్లు ఉండగా మార్కెట్ విలువ రూ.5 కోట్లు పైగానే పలుకుతుంది. ఈ భూమిని ఆక్రమించేందుకు స్థానికంగా ఓ రాజకీయ నేత గుట్టుగా ఈ బాగోతం నడిపినట్లు తెలుస్తోంది. అక్రమ రిజిస్ట్రేషన్లలో ఆరితేరిన వ్యక్తులను ఎంచుకుని ఈ కథ నడిపినట్లు సమాచారం.

### ముందుకు సాగని దర్యాప్తు

ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారం జిల్లాలో సంచలనం కాగా కేసు దర్యాప్తులో నీలినీడలు కమ్ముకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కేసులో సూత్రధారితో పాటు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న చాకలి ఈరన్న కీలకం. చాకలి ఈరన్న మరో ఇద్దరు రైతుల నుంచి రూ.20 లక్షలు తీసుకుని వారికి ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ క్రమంలో బాధితుడి ఫిర్యాదుతో జనవరి 4వ తేదీన టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు ఆముదాల భాస్కర్, చాకలి ఈరన్న, సబ్‌రిజిస్ట్రార్ అజీమియా, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు ఈరన్న, రమేష్, డాక్యుమెంట్ రైటర్ షేక్ మహబూబ్ బాషాపై కేసు నమోదైంది. తర్వాత మూడు రోజులకు మరో నలుగురిపై కేసు నమోదు చేశారు. మరొక డాక్యుమెంట్ రైటర్ షేక్ షబ్బీర్, ముగ్గురు సాక్షులు ఈజస్, ఈరన్న, లోకనాథరెడ్డిపై కేసు నమోదైంది. నిందితులంతా ఆదోనిలో ఉన్నా విడతల వారీగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అలాగే సబ్‌రిజిస్ట్రార్ అజీమియాను అరెస్ట్ చేయకుండా బెయిల్ వచ్చే వరకు వేచి చూడటం వెనుక ఏదో జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కేసులో భారీగా డబ్బు చేతులు మారిందనే చర్చ ప్రజల్లో నడుస్తోంది.

### ఎనిమిది మందిని అరెస్ట్ చేశాం

అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో పది మందిపై కేసు నమోదు చేసి ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశాం. సబ్ రిజిస్ట్రార్ బెయిల్‌పై ఉండగా, మరో నిందితుడు పరారీలో ఉన్నారు. సబ్ రిజిస్ట్రార్‌ను అరెస్ట్ చేయకుండా డబ్బులు తీసుకుని తప్పించారనేది అవాస్తవం. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలో పట్టుకుంటాం. – సూర్య మోహన్‌రావు, టూటౌన్ సీఐ